క్లుప్తంగా

ఎమ్మెల్యే వసంత సహకారంతో గ్రామాభివృద్ధి

తోలుకోడు(మైలవరం): ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం తోలుకోడు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో గ్రామస్తులు శుక్రవారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి దుర్గారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుర్రి ప్రతాప్ మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి శ్మశానవాటికలు పిచ్చికంపతో అల్లుకుపోయి ఉన్నాయని, వాటి లోని కంప తొలగించినట్లు తెలిపారు. డ్రైయినేజీలు బాగు చేసి, మురుగునీరు పారుదల జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇంకొల్లు చంటి, కర్రి సునీల్, గోళ్ళ నాగరాజు, వార్డు సభ్యుడు గారపాటి షరీక్, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): జిల్లాలోని వివిధ గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖరరావు అన్నారు. జూపూడి గ్రామ పంచాయతీలో రూ.15 లక్షల మండల ప్రజాపరిషత్ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీలు, కల్వర్టులు, బోరుపంపు నిర్మాణంకు ఎంపీడీవో రామకృష్ణ నాయక్‌తో కలసి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. పనులు పారదర్శకంగా జరగాలని సూచించారు. జూపూడిలో జరుగుతున్న పనులతో గ్రామం రూపురేఖలు మారతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచి కాకి దేవమాత, వైస్ ఎంపీపీ బాణావత్ నాగ బాలమ్మ, పంచాయతీ కార్యదర్శి మునేశ్వర రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బ్యానర్‌లు తొలగింపు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సిబ్బంది శుక్రవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఫ్లెక్సీలు తొలగించారు. మున్సిపల్ ఏరియాలో అనుమతులు లేకుండా బ్యానర్‌లు ఏర్పాటు చేయరాదని, ముందస్తు అనుమతితో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, వ్యాపారులు అనుమతి లేకుండా బ్యానర్‌లు ఏర్పాటు చేయడంతో వాటిని తొలగించారు.

లాభదాయకంగా పెరటికోళ్ల పెంపకం

ఇబ్రహీంపట్నం: పెరటికోళ్ల పెంపకం డ్వాక్రా మహిళలకు లాభదాయకంగా ఉంటుందని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. ఇబ్రహీంపట్నం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం వద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు శుక్రవారం పెరటికోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పెరటికోళ్లు నాటుకోళ్ల మాదిరిగా మన పరిసరాలకు అనుగుణంగా పెరుగుతాయన్నారు. వీటి ద్వారా అదనపు ఆదాయం పొందొచ్చన్నారు. డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లబ్ధిదారుల నుంచి 100 యూనిట్లు అర్జీలు రాగా వాటిలో 35 యూనిట్లు అందజేశామన్నారు. మిగిలిన యూనిట్లు త్వరలో అందిస్తామని తెలిపారు. ఏపీఎం శోభన్‌బాబు, పాలడుగు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ నివారణపై ప్రజ్వల స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మూలపాడు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ప్రజ్వల సంస్థ రాష్ట్ర సమన్వయకర్తలు బలరామకృష్ణ, చంద్రయ్య మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలనకు గత 26 ఏళ్లుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి 26,500 మంది మహిళలు, బాలికలను కాపాడినట్లు చెప్పారు. బాధితులు కథనాల డాక్యుమెంటరీ ప్రదర్శించారు. రాష్ట్రంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి బాలికలను జాగృతం చేస్తామన్నారు. సంస్థ ప్రతినిధి నాగకరుణ, హెచ్‌ఎం కేఎస్‌జే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం

ఇబ్రహీంపట్నం:.పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ట్రక్ టెర్మినల్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. అసలే ఎండలు ముదరడంతో ఎండిపోయిన చెట్లకు మంటలు అలుముకుని నిరుపయోగంగా ఉన్న దుకాణాలకు వ్యాపించాయి. దీంతో దుకాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మద్యం మత్తులో ఆకతాయిలు చేసిన పనికి మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది.

ప్రజా సమస్యల పరిష్కారం

చాట్రాయి: ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చనుబండ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. సొంత స్థలాల్లో గృహాలు నిర్మించుకునే వారు గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఎంపీటీసీ దార్ల సోనీ ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు జల్లేపల్లి పరమేశ్వరరావు, వనమా వాసు, విస్సంపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

పామాయిల్ సాగు...లాభం బహు బాగు

- ఎన్టీఆర్ జిల్లాలో 12 వేల హెక్టార్లలో సాగు
- ఈ ఏడాది టన్ను రూ.13 వేల వరకు ధర
- ఏడాదికి రూ.21 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ప్రభుత్వ ప్రోత్సాహకం
- ఆయిల్ పామ్ సాగుకు మొగ్గు చూపుతున్న మెట్ట ప్రాంత రైతులు


మొర్సుమల్లిలోని పామాయిల్ తోట (ఇన్‌సర్ట్) పామాయిల్ చెట్టుకు కాసిన గెల

మైలవరం: పామాయిల్ తోటల పెంపకం లాభసాటిగా మారడంతో రైతులు దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. పామాయిల్ మొక్కలు ఒకసారి నాటితే దీర్ఘకాలం ఆదాయం వస్తుందని రైతులు ఈ సాగుపై దృష్టి సారించారు. దీనికితోడు ప్రభుత్వం వీటి సాగుకు ప్రోత్సాహకాలు కూడా ఇస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో 12వేల హెక్టార్లలో రైతులు పామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పామాయిల్ గింజలకు గిట్టుబాటు ధర లభించడంతో రైతులు పామాయిల్ తోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది పామాయిల్ గింజలు టన్ను రూ.13,000 వరకు ధర పలికింది. గోదావరి జిల్లాలో పామాయిల్ తోటల పెంపకం ఇప్పటికే అభివృద్ధి చెందింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం, రెడ్డిగూడెం, విస్సన్నపేట, గంపలగూడెం, తిరువూరు, కంచికచర్ల తదితర మండలాల్లో రైతులు పామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. గతంలో రైతులే రవాణా ఖర్చులు భరించి పామాయిల్ విత్తనాలను హనుమాన్‌జంక్షన్‌లోని పామాయిల్ మిల్లుకు తరలించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆయిల్‌మిల్ యాజమాన్యమే వారానికి ఒకరోజు రవాణా సౌకర్యం కల్పించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం పామాయిల్ మొక్క ఖరీదులో నూరు శాతం రాయితీతో పాటు సాగుకు ఏడాదికి రూ.21వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఇస్తున్నారు. అలాగే సబ్సిడీ మీద డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది.

మొక్కలు పెంచే విధానం

ఎకరం పొలంలో మొత్తం 57 మొక్కలు నాటుకోవచ్చు. మొక్కకు మొక్కకు మధ్య 9 మీటర్లు దూరం ఉండేటట్లుగా చూసుకోవాలి. మొక్క మొదళ్లలో నీరు నిల్వ ఉండకుండా తడి మాత్రమే ఉండేట్లుగా చూసుకోవాలి. మూడేళ్ల తర్వాత కాపు దిగుబడికి వస్తుంది. తొలి కాపుగా గెల 5 కిలోల నుంచి 10 కిలోల వరకు ఉంటుంది. రెండవ ఏట నుంచి గెల 10 కిలోల నుంచి 25 కిలోల వరకు దిగుబడినిస్తుంది. ఎకరాకు 10 నుంచి 12 టన్నుల పామాయిల్ విత్తనాలు దిగుబడి ఉంటుంది. ధర కూడా ఆశించిన మేర లభించడంతో రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపుతున్నారు.

పామాయిల్ తోటల పెంపకానికి రైతుల ఆసక్తి

ఆయిల్‌పామ్ పెంపకానికి రైతులు ముందుకు వస్తున్నారు. గతంలో ఆశించిన మేరకు గిట్టుబాటు ధర రాకపోవడంతో కొంత నిరాసక్తత చూపించినా ప్రస్తుతం మద్దతు ధర ఇవ్వడంతో రైతులు ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై శ్రద్ధ చూపిస్తున్నారు. అందుకు అనువుగా రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది.

-సొహైల్ అహ్మద్, హార్టికల్చర్ ఇన్‌చార్జి అధికారి, మైలవరం

ఎల్బీఆర్సీఈలో ఐఎస్ఓ న్యూ సర్టిఫికేషన్ ఆడిట్


మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న నాగరాజు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐఎస్ఓ న్యూ సర్టిఫికేషన్ ఆడిట్ మూడు రోజులు విజయవంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. గ్లోబల్ స్టాండర్డ్స్ ప్రకారం క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్‌ని మెజర్ చేయడానికి కళాశాల యాజమాన్యం మూడు సర్టిఫికేషన్‌ల కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. లీడ్ ఆడిటర్ ఆఫ్ ఏక్యూసీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, న్యూఢిల్లీ ఎల్.నాగరాజు వివిధ విభాగాలలో సెక్షన్లను సందర్శించి కళాశాలలో క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్స్‌ను తనిఖీ చేశారన్నారు. ఎనర్జీ సేవింగ్, ఎన్విరాన్‌మెంటల్, ఎడ్యుకేషనల్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ కోసం కళాశాల తీసుకుంటున్న చర్యలను అభినందించి సర్టిఫికెట్లకు రికమెండ్ చేసినట్లు ప్రిన్సిపాల్ కె.అప్పారావు తెలిపారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై సదస్సు

లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈఈఈ, సీడీఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై ఐదు రోజులుగా నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ గురించి ఐఈఈఈ మేనేజర్ ప్రమోద్ విద్యార్థులకు వివరించారు.

మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండాలి


పుల్లూరు హైస్కూల్‌లో భోజనం చేస్తూ నాణ్యత పరిశీలిస్తున్న లక్ష్మీరెడ్డి, రేణుక తదితరులు

పుల్లూరు(మైలవరం): ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం రుచి, శుచిగా ఉండేట్లుగా తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి తెలిపారు. మైలవరం మండలంలోని రేషన్ షాపులు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలను ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి రేణుకతో కలిసి శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మైలవరం మండలం పుల్లూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం 55 కిలోలు వండినట్లు రికార్డుల్లో నమోదై ఉందని, కానీ ఆ పరిమాణంలో అన్నం కన్పించడం లేదన్నారు. భోజన పదార్థాలు బాగుంటే పిల్లలు స్కూల్లోనే తినేవారని, కానీ ఎక్కువ మంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచే క్యారేజీలు తీసుకువస్తున్నట్లు కన్పిస్తోందన్నారు. చిక్కీలు ఇవ్వకపోవడాన్ని గుర్తించారు. వంట ఏజెన్సీలు పద్ధతులు మార్చుకోవాలని, భోజనంతో పాటే చిక్కీలు కూడా ఇవ్వాలన్నారు. మండలంలోని చంద్రగూడెం గ్రామంలో రేషన్ షాప్ నంబర్ 18 తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మైలవరంలోని ప్రభుత్వ వసతి గృహాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం

కొండపర్వ(విస్సన్నపేట): గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పోషకవిలువలు కలిగిన ఆహారం అందిస్తున్నట్లు స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి అన్నారు. మండలంలోని కొండపర్వ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రుక్మాంగదయ్య, తహసీల్దార్ కె.లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

ఎ.కొండూరు: సాగర్‌జలాలు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, రైతుల ఆధ్వర్యంలో విజయవాడ-జగదల్పూర్ జాతీయ రహదారిపై ఎ.కొండూరు మత్రియ తండా వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలోని జమలాపురం మేజర్ కాలువకు సాగర్ నీరు విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని కోరారు. ఎన్ఎస్‌పీ అధికారులు జమలాపురం మేజర్ కాలువకు సాగునీరు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో పీవీ ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సీతారెడ్డి, రైతు సంఘ నాయకులు పి.ఆనందరావు, ఎ.అంబిరెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, సీఐటీయూ నాయకులు జట్టి వెంకటేశ్వరరావు, గొల్లమందల తండా సర్పంచ్ డి.రాముడు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీ.కాలనీ ఆడిటోరియంలో గతనెల 23వ తేదీ నుంచి ప్రారంభమైన యోగా శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ట్రస్ట్ చైర్మన్ సురేష్‌బాబు మాట్లాడుతూ యోగా అంటే పిల్లల నుంచి వృద్ధుల వరకు కులమతాలకు అతీతంగా అందరూ ఆచరించదగిన జీవన విధానమన్నారు. యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ యోగా నిత్యజీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. అనంతరం జనార్దన్ దంపతులను సత్కరించారు. ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

విస్సన్నపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. స్థానిక నూజివీడు రోడ్డులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీల హాజరుశాతం తనిఖీ చేశారు.

సంక్షిప్తం

■ బాలికలను రక్షించుకోవాలి

ఆగిరిపల్లి: సమాజంలో బాలికలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జాస్తి జగన్ మోహనరావు అన్నారు. బేటీ బచావో బేటీ పడావో వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలకు 19 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు వయస్సు నిండిన తరువాత వివాహం చేయాలని బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆడ పిల్లలను బతికించండి-ఆడ పిల్లలను రక్షించండి అంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

■ జగనన్న భూరక్షణ పథకంతో రైతులకు మేలు

ఆగిరిపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్షణ పథకంతో రైతులకు మేలు కలుగుతుందని ఈదులగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య అన్నారు. మండలంలోని ఈదులగూడెంలో ఉన్న 2254.29 ఎకరాలను అత్యాధునిక టెక్నాలజీతో డ్రోన్ ద్వారా భూమి హద్దులను గుర్తించి రెవెన్యూ అధికారులతో రీసర్వే చేయించి భూయజమానులకు పట్టాలు మంజూరు చేస్తామని ఆర్‌ఐ లక్ష్మీ నాంచారమ్మ తెలిపారు. దానిలో భాగంగా డ్రోన్ ఫ్లై ద్వారా సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ నండూరి భాస్కర్ ప్రసాద్, వీఆర్వో అజయ్ కళ్యాణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

■ 7న ఆగిరిపల్లిలో మినీ జాబ్ మేళా

నూజివీడు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7న ఆగిరిపల్లిలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు శుక్రవారం తెలిపారు. ఈ మేళాలో రిలయన్స్ మార్ట్, మోహన్ స్పిన్‌టెక్, వరుణ్ మోటార్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పిస్తారని చెప్పారు. ఈ మేళాకు ఏడో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన 18-35ఏళ్ల లోపు వయస్సున్న నిరుద్యోగ యువత పాల్గొనాలని కోరారు. వివరాలకు 83740 39719కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

■ ఎస్సీ వర్గీకరణపై బీజేపీది మొండివైఖరి

చాట్రాయి:ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మొండి వైఖరి అవలంబిస్తోందని ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యంద్రాతి కోటేశ్వరావు ఆరోపించారు. ఆ శాఖ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మండలంలోని చనుబండ గ్రామంలో ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ నిర్వహించిన మహా పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతరం బాబూ జగ్జీవన్‌రాం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ కంకట వెంకటేశ్వరావు, మండల కన్వీనర్ రఘురాం, మండల శాఖ నాయకులు గార్లపాటి మారేష్,జోషి, కంచర్ల భాస్కరావు, లాజరు తదితరులు పాల్గొన్నారు.

■ రికార్డులు పారదర్శకంగా నిర్వహించాలి

చాట్రాయి: భూముల రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన కల్లేపల్లి రమేష్ భూములకు సంబంధించిన సరిహద్దులను గుర్తించాలని సచివాలయంలో అర్జీ పెట్టుకున్నాడు. దీంతో శుక్రవారం క్షేత్ర స్థాయిలో భూరికార్డులను పరిశీలించి సరిహద్దులను గుర్తించారు. కార్యక్రమంలో సర్వేయర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

■ రేపటిలోగా ఈ-క్రాప్ నమోదు చేయాలి

తిరువూరు: దాళ్వా సాగుచేస్తున్న రైతులు తమ పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ కోరారు. మండలంలోని వావిలాల రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం ఈ-క్రాప్ నమోదు పరిశీలించిన సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలిచ్చారు. ఈ నెల 4వ తేదీలోపు ఈ-క్రాప్ లో పంటల వివరాలను నమోదు చేయించుకోకపోతే రైతులు తమ పంట దిగుబడులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి ఇబ్బందులు ఎదురవుతాయని, ఇతర సబ్సిడీ పథకాలకు కూడా అనర్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

■ నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

తిరువూరు: పాఠశాలల్లో నాడు-నేడు నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మహేశ్వరరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో సెక్టోరల్ అధికారులు, ఎంఈవోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. భవనాల నిర్మాణానికి ఇసుక తగినంత నిల్వ చేసుకోవాలని, పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు సమర్పించాలని సూచించారు. బైజూస్ యాప్ ద్వారా ట్యాబ్‌లలో 8వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించాలని, బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి చేర్చాలని చెప్పారు. ఎంఈవోలు సోమశేఖరనాయక్, రామకృష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

■ గేదెలు, పొట్టేళ్ల యూనిట్లు ఏర్పాటుచేయాలి

గంపలగూడెం: స్వయం సహాయక సంఘాల మహిళలతో గేదెలు, పొట్టేళ్ల యూనిట్ల ఏర్పాటులో సిబ్బంది మండలానికి కేటాయించిన టార్గెట్లను వెంటనే పూర్తి చేయాలని డీఆర్డీఏ పీడీ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గంపలగూడెం వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం వెలుగుమిత్రలు, గ్రామసమాఖ్య అధ్యక్షులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంబంధిత యూనిట్ల ఏర్పాటులో మండలం పూర్తిగా వెనుకబడి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిట్ల ఏర్పాటుతో ఆ కుటుంబానికి ఒనగూరే ప్రయోజనాలను, ఆర్థిక వెసులుబాట్లపై సిబ్బంది మహిళల్లో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. సమావేశానికి వైఎస్ఆర్ క్రాంతి పథం అనుబంధ శాఖల మండల అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు స్వయం సహాయక సంఘాలు, సీ, డీ గ్రేడులలో ఉండటాన్ని ఆయన తప్పు పట్టారు. సమావేశంలో ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, వైఎస్ఆర్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ యు.రాజేశ్వరి, ఏపీఎం నాగరాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ, సీసీలు పాల్గొన్నారు.

త్వరలో ఇంటింటికీ నీటి కుళాయి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్


కవులూరులో సంక్షేమ పథకాల అమలు గురించి స్థానికుడిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: జల జీవన్ మిషన్ కింద కవులూరు గ్రామంలో త్వరలో ఇంటింటికీ నీటి కుళాయిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని కవులూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే, స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కింద కవులూరులో ఇంటింటికీ నీటి కుళాయిని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2.12 కోట్లు మంజూరైనట్లు వివరించారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి అడిగిన వెంటనే నిధులు విడుదల చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు. రాష్ట్రంలో నిరుపేద ప్రజలంతా ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి అనేక వినూత్న పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అదానీ కుంభకోణం భారం పేదలపై మోపిన మోడీ



మైలవరంలో సీపీఎం ఆధ్వర్యంలో గ్యాస్ ధరలు తగ్గించాలని ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మైలవరం: వంట గ్యాస్ ధర రూ.50 పెంచి దేశంలో అదానీ కుంభకోణం భారాన్ని కేంద్ర ప్రభుత్వం పేదలపై మోపిందని సీపీఎం మైలవరం మండల కార్యదర్శి రావూరి రమేష్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలిండర్ ధర రూ.350 పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు నూజివీడు రోడ్డులో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకరరావు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.ఇసాక్, మైలవరం శాఖ కార్యదర్శి దేవేంద్రనాథ్, చిలుకూరి రాజారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూడా పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మైలవరం ప్రధాన రహదారుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు.

మహిళల ఉపాధికి మంచి అవకాశం


కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న ధర్మరాజు, రత్నబాబు, కోయ సుధ, గోపాల్ తదితరులు

వెల్వడం(మైలవరం): మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలు గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ప్రత్తిపాటి ధర్మరాజు తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామం దళితవాడలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ పర్యవేక్షణలో మహిళలకు కుట్టు శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ ప్రత్తిపాటి రత్నబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిల అభివృద్ధికి కృషి చేస్తున్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. వెల్వడం గ్రామానికి చెందిన శ్రీపద్మజా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ప్రవాసాంధ్రులు కుడుముల వెంకట నారాయణరెడ్డి తమ సొంత గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్.మనిషే, కోశాధికారి డి.విజయలక్ష్మి, దారా మాధవి, ట్రైనర్ నాగమణి, ప్రత్తిపాటి రవి, పి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు దెబ్బతినకుండా తమ్మిలేరుకు నీరు వదిలాం

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు


బలివేలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రబీ సాగు దెబ్బతినకుండా మంకొల్లు రిజర్వాయర్ నుంచి తమ్మిలేరు కాలువకు నీరు విడుదల చేయించామని, ఆ నీటితో లోపూడి, గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం, బలివే, వెంకటాపురం, వేల్పుచర్ల గ్రామాల్లోని అన్ని చెరువులను నింపుతున్నామని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. మండలంలోని బలివే గ్రామ శివారు రంగంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలతో కలసి ముందుగా బలివే రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గడప గడపకూ తిరుగుతూ లబ్ధిదారులను పలకరిస్తూ, పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ రాజానాయన, స్థానిక సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఎంపీటీసీ డి.రాట్నాలు, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జేసీ దృష్టికి నివేశన స్థలాల పంపిణీ సమస్య


జిల్లా జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో నివేశన స్థలాల పంపిణీ సమస్య గురించి జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ దృష్టికి తిరువూరు శాసన సభ్యుడు కె.రక్షణనిధి తీసుకువెళ్లారు. విజయవాడలోని జేసీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆమెను కలసిన ఎమ్మెల్యే మండలంలోని పెనుగొలను, గొల్లపూడి, సొబ్బాల గ్రామాల్లో నివేశన స్థలాలు పంపిణీ చేయాల్సి ఉందని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సాంకేతిక లోపం కారణంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల ఖాతాల్లో జమ కాని నగదు విషయమై కూడా జేసీతో చర్చించారు. రైతులకు నగదు చెల్లింపు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు గోగులమూడి చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని ప్రదర్శన

తిరువూరు: కేంద్రప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ తిరువూరులో మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన జరిపారు. మధిర రోడ్డులో జరిగిన ప్రదర్శనలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో మహిళలు పాల్గొన్నారు. సామాన్య, పేద కుటుంబాలు కొనుగోలు చేయలేని స్థితిలో గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం తగదని, వెంటనే ధరలు తగ్గించాలని ఐద్వా నాయకులు మరియమ్మ, శిరీష డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగిఉండాలని వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ తెలిపారు. శుక్రవారం చాట్రాయి రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పంటలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ మురళీమోహనరావు, వెలుగు ఏపీఎం శేఖర్,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తం

నూజివీడు: ఇటీవల సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. మొబైల్ ఫోన్‌లకు కింది లింక్ క్లిక్ చేయండి అని మెస్సేజ్ వస్తే లింకు క్లిక్ చేయవద్దని సూచించారు. పార్సిల్ వచ్చింది, ఓటీపీ చెప్పండి అని అడిగితే ఓటీపీ చెప్పవద్దన్నారు. 1930 అనే నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.